# ప్రజావాది దృక్పథం-సిరికి స్వామి నాయుడు కవిత్వం

ఏ కాలానికి ఆ కాలం సాహిత్యం అద్దం పట్టడం సహజ లక్షణం. ముఖ్యంగా కవిత్వం ఒక సంఘటనకు, ఒక దృశ్యానికి తక్షణ స్పందనగా వెలువడే ప్రక్రియ. అందుకే కవిత్వాన్ని కాలాన్ని పట్టి చూపించే మెరుపు అద్దంగా భావిస్తారు. చరిత్రను కళాత్మకంగా వ్యక్తపరచే గొప్ప సాధనం కూడా కవిత్వమే. వర్తమాన సమాజంలోని సంక్లిష్ట పరిస్థితులు కవిత్వాన్ని మరింత ప్రభావవంతంగా, బాధ్యతాయుతంగా మార్చాయి. నేటి కవిత్వం కేవలం భావ వ్యక్తీకరణ కాదు. అది దుఃఖం, ఆవేదన, ఆగ్రహం, పోరాటం ఆల్ ఇన్ వన్ రూపంగా పరిణమించింది. కవి సమాజానికి కేవలం పరిశీలకుడే కాదు, మార్గదర్శకుడు కూడా. సమస్యలను మాత్రమే చూపించడం కాకుండా, వాటి మూలాలను విశ్లేషించి, పరిష్కార దిశను సూచించాల్సిన బాధ్యత కూడా కవిత్వంపై ఉంది. కవికి సామాజిక చలనాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, దాన్ని సమీకరించి ప్రజల ముందుంచే ధర్మం ఉంది. ఈ లక్షణాలన్నింటినీ ప్రతిబింబించిన కవి సిరికి స్వామి నాయుడు. వీరు ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రజావాది దృక్పథంతో నిలిచిన కవి. వీరు బి.ఎ., బి.ఎడ్ చదివి ప్రస్తుతం మన్యం జిల్లా, పార్వతీపురంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు గౌరమ్మ మరియు సత్యంనాయుడు. ఆయన స్వగ్రామం విజయనగరం జిల్లా, తెర్లాం మండలంలోని కుసుమూరు గ్రామం.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కల్లోలం వీరి కవిత్వానికి నేపథ్యంగా నిలిచింది. ఈ ప్రాంత ప్రజల జీవన కాంక్షలను అణచివేసే శక్తులపై వీరి కవిత్వం ఖడ్గంలా మారింది. ముఖ్యంగ "మంటిదివ్వ" చదివినప్పుడు ఉత్తరాంధ్ర దుఃఖభరిత వాస్తవం మన కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. "మంటిదివ్వ" కవితా సంపుటి ఒక సామాజిక పత్రం. ఇది ప్రజల బాధను మాత్రమే కాదు, వారి పోరాటాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. సిరికి స్వామి నాయుడు కవిత్వం సమాజానికి ఒక వాగ్దానం..అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, బాధను పంచుకునే సానుభూతి, మార్పు కోసం పోరాడే సంకల్పం. ఇలాంటి కవిత్వం సమాజానికి అవసరం. అందుకే వీరి నుంచి మరింత గొప్ప సాహిత్యం రావాలని ఆశించవచ్చు. అలాగని ఈ పరిస్థితి ఒక్క ప్రాంతానికే పరిమితం కాదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అలాంటి గాయాలను మాన్పే మృదుహస్తం కూడా కవిత్వమే, అదే సమయంలో బాధితుల వెన్నంటే నిలబడి ధైర్యం ఇచ్చే శక్తిగా కూడా అది పనిచేస్తుంది. స్వామి నాయుడు కవిత్వంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న దోపిడీపై తీవ్ర విమర్శ కనిపిస్తుంది. భూమిని, సహజ వనరులను కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకునే విధానంపై ఖండన కనిపిస్తుంది. "కంచే చేను మేస్తే" వంటి కవితల్లో ఈ దోపిడీని స్పష్టంగా చూపిస్తారు. సమాజంలోని రహస్యాలను వెలికితీసి ప్రజల ముందు ఉంచడం నిజమైన కవి లక్షణం. ఈ దృష్టిలో స్వామి నాయుడు ఒక నిజమైన ప్రజాకవి.

కళింగాంధ్ర ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ల ప్రభావంపై వీరు రాసిన "మంట", "తూరుపు ఒక నెత్తుటి పొద్దు" వంటి కవితలు ప్రజల బాధను ప్రతిబింబిస్తాయి. కాలమే కవిని తయారు చేస్తుందని చెప్పినట్లుగా, వీరి కవిత్వం కూడా వేదన నుంచి పుట్టింది. ప్రజలపై ప్రేమ, వారి సమస్యలపై ఆవేదన వీరి రచనలకు మూలాధారం. స్వామి నాయుడు కవిత్వంలో పల్లె జీవితం, మత్స్యకారుల కష్టాలు, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలు కూడా ప్రధానంగా కనిపిస్తాయి. "పల్లెవాళ్ల ఆల్చిప్పల కళ్లలోంచి కురిసే కన్నీళ్లు–సముద్రం" అనే భావన ద్వారా ప్రజల దుఃఖాన్ని వీరి హృదయానికి హత్తుకునేలా వ్యక్తం చేస్తారు. ప్రకృతి విధ్వంసం, భూమి మార్కెట్ సరుకుగా మారడం, సంస్కృతి క్షీణత వంటి అంశాలపై వీరు ఆందోళన వ్యక్తం చేస్తారు.

అడవి, భూమి, ప్రకృతి లాంటివన్నీ తీవ జీవనాధారాలు మాత్రమే కాకుండా ప్రజల అస్తిత్వానికి సంకేతాలు. వాటిని కాపాడే పోరాటాలను వీరు సానుభూతితో చిత్రించారు. సమాజంలో జరుగుతున్న అసమానతలు, అన్యాయాలు వీరి కవిత్వంలో స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. కవి సమాజానికి కన్నులాంటివాడు, కాపలాదారుడు, వెలుగుబావుటా అనే భావనను వీరి రచనలు బలంగా నిరూపిస్తాయి."మట్టి రంగు బొమ్మలు" కవిత సంపుటిలోని భావజాలాన్ని చాలా బాగా ప్రతిబింబిస్తాయి. ఈ సంపుటిలో ప్రధానంగా సాధారణ ప్రజల జీవితం, వారి కష్టాలు, ప్రకృతితో ఉన్న అనుబంధం కనిపిస్తాయి. జాలరి వాడ గురించి వచ్చిన ఈ కవితలో మత్స్యకారుల జీవితం ఎంత సముద్రంపై ఆధారపడి ఉందో చూపించారు. సముద్రాన్ని వాళ్లు కేవలం జీవనాధారంగా కాకుండా తమ స్నేహితుడిగా, కుటుంబ సభ్యుడిగా భావిస్తారు. "మా సముద్రాన్ని మాకివ్వండి" అనే వాక్యం వారి హక్కుల కోసం చేసే వేడికగా కనిపిస్తుంది. ఇది వారి బాధను, అన్యాయాన్ని తెలియజేస్తుంది.

అలాగే సముద్రాన్ని కవి జీవంలా వర్ణించడం ఈ సంపుటి ప్రత్యేకత. ప్రకృతిలోని ప్రతి అంశాన్ని మనుషుల భావాలతో కలిపి చూపించడం ఇందులో ప్రధాన లక్షణం. జాలరుల జీవితం, వారి ఆనందాలు, కష్టాలు అన్నీ చాలా సహజంగా, హృదయానికి దగ్గరగా చూపించారు. ఈ సంపుటిలోని కవితలు సాధారణ ప్రజల జీవిత సత్యాలను, ప్రకృతితో వారి అనుబంధాన్ని, సామాజిక సమస్యలను మనసుకు హత్తుకునేలా తెలియజేస్తాయి.

ముఖ్యంగా..'దుర్ల' కవితలో కవి ప్రకృతిని ఎంతో స్పష్టంగా, అందంగా వర్ణించాడు. మబ్బులు కొండల మీదుగా ఊరేగి అడవిపై కురుస్తున్న దృశ్యం మనకు కనిపించేలా చెప్పాడు. పచ్చని కొండలు తెల్లని మబ్బులతో ముచ్చట్లు మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తాయి. పొదల మధ్యనుంచి తొంగిచూస్తున్న అడవి జింకలా ప్రకృతి చలాకీగా, సజీవంగా కనిపిస్తుంది. మంచు తెరల మధ్యనుంచి సూర్యుడు మెల్లగా కనిపించడం ఆ అందాన్ని మరింత పెంచుతుంది. పూలతో నిండిన అడవి కొత్తపెళ్లి కూతురిలా కళకళలాడుతుంది. చైత్రమాసంలో కోయిలల కూయడం వసంతానికి ఆహ్వానం పలుకుతున్నట్టు ఉంటుంది. పసుపు పూలతో వసంతం ప్రకృతిని అలంకరిస్తుంది. ఈ అందమైన వాతావరణంలో



కందికొత్తల పండుగ ఉత్సాహంగా, ఆనందంగా వచ్చి చేరుతుంది. మొత్తం కవిత ప్రకృతి సోయగం, వసంతకాల ఉల్లాసం, పండుగ ఆనందాన్ని చాలా చక్కగా వ్యక్తపరుస్తుంది.

జాలరి వాడ మీద 'నీలి జెండా' కవితలో జాలరుల (మత్స్యకారుల) జీవితం, వారి భావోద్వేగాన్ని చాలా హృదయానికి హత్తుకునేలా వ్యక్తపరిచాడు. జాలరి వాడ మీద ఎగురుతున్న నీలి జెండా వారి సముద్రంతో ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. "మా సముద్రాన్ని మాకివ్వండి" అని వారు చెప్పడం ద్వారా, తమ జీవనాధారం అయిన సముద్రాన్ని ఎవరో దూరం చేస్తున్నారని బాధను వ్యక్తం చేస్తున్నారు. సముద్రాన్ని కవి ఒక జీవిలా చూపించాడు. తలుపు తెరిస్తే కుక్కపిల్లలా తోక ఊపుతూ మాతో కలిసి నడిచినట్టుగా, అలల పల్లకిలో ఊరేగించినట్టుగా, వెన్నెల రాత్రుల్లో తీరంపై మధురమైన మాటలు చెప్పినట్టుగా భావోద్వేగంగా వర్ణించాడు. ఇది జాలరులకి సముద్రం ఎంత సన్నిహితమో తెలియజేస్తుంది.

"మా నీలితరగల ఆకాశాన్ని మాకివ్వండి" అనే వాక్యం వారి స్వేచ్ఛను సూచిస్తుంది. సముద్రం మాత్రమే కాదు, ఆకాశం కూడా వారి జీవితంలో భాగమని చెబుతుంది. చివరగా "మా నెచ్చెలిని మాకివ్వండి" అని చెప్పడం ద్వారా సముద్రాన్ని తమ ప్రియమైన స్నేహితురాలిగా, సహచరిగా భావిస్తున్నారని తెలుస్తుంది. మొత్తం కవితలో జాలరుల జీవితం, సముద్రంతో వారి ఆత్మీయ సంబంధం, అలాగే తమ హక్కులను కోల్పోతున్న బాధ స్పష్టంగా వ్యక్తమవుతుంది.

సిరికి స్వామి నాయుడు ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రత్యేకమైన స్వరంతో నిలిచిన కవి. వీరి కవిత్వం భావవ్యక్తీకరణకే పరిమితం కాకుండా సమాజంలోని అట్టడుగు వర్గాల జీవన వాస్తవాలను ప్రతిబింబించే ఒక సామాజిక పత్రంగా నిలుస్తుంది. ముఖ్యంగా ఆదివాసీ జీవితం, ప్రకృతి, దోపిడీ, అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం వంటి అంశాలు వీరి కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తాయి. మైదాన ప్రాంతంలో జన్మించినప్పటికీ, ఉపాధ్యాయుడిగా కొండ ప్రాంతాల్లో దీర్ఘకాలం పనిచేసిన అనుభవం వీరికి ఆదివాసీల జీవన విధానంపై లోతైన అవగాహనను కలిగించింది. ఈ అనుభవం వీరిని ఒక పరిశీలకుడిగా కాకుండా, వారి బాధలను తనవిగా భావించే కవిగా మలిచింది. 'అంగడి' కవితలో కవి ఆదివాసీల అమాయకత్వాన్ని మరియు వారిపై జరిగిన దోపిడీని చాలా ప్రతీకాత్మకంగా చూపించారు. ఒకప్పుడు అడవి పూర్తిగా ఆదివాసీల చేతుల్లో ఉండేది. వారు సాధారణ జీవితం గడుపుతూ ప్రకృతితో సహజంగా మమేకమై జీవించేవారు. "కాటా" మరియు "జంగిడి" వంటి సాధనాలు వారి జీవన విధానానికి సంకేతాలు.

"జంగిడి పరిచి అంగడన్నాడు" అనే వాక్యం ద్వారా అడవిని ఒక మార్కెట్‌గా మార్చిన ప్రక్రియను సూచిస్తున్నారు. అంటే ప్రకృతిని కూడా వ్యాపార వస్తువుగా మార్చడం. "కాటా ధర్మం తప్పదు" అని చెప్పి తూకం, లావాదేవీ అనే భావనను వారిపై రుద్దాడు. "కళ్ళు మూసుకుని నమ్మాలన్నాడు" అనే పాదం ఆదివాసీల అమాయక విశ్వాసాన్ని చూపిస్తుంది. వారు అతడిని నమ్మి కళ్ళు మూసుకుంటారు. కానీ అదే వారి నష్టానికి కారణమవుతుంది. "కాటా అడవిని తూకం వేసింది" అంటే అడవిని కొలిచి, విలువ కట్టి, దాన్ని వస్తువుగా మార్చేశారు. చివరికి "కళ్ళు తెరిచేసరికి" అన్నప్పుడు నిజం తెలిసేసరికి ఆలస్యమైపోతుంది. అడవి మొత్తం బయటి వ్యక్తి చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఆదివాసీలకు మిగిలింది కేవలం "జంగిడి" మాత్రమే. ఇది వారి సంపద, అస్తిత్వం అంతా కోల్పోయి, ఖాళీ చేతులతో మిగిలిపోయిన పరిస్థితిని సూచిస్తుంది. ఈ కవిత ద్వారా కవి అభివృద్ధి, వ్యాపారం, ఆధునికత పేరుతో జరుగుతున్న దోపిడీని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అమాయకత్వం, నమ్మకం ఎలా దుర్వినియోగం అవుతాయో కూడా చూపిస్తున్నారు. మొత్తం మీద ఇది ఆదివాసీల అస్తిత్వ నష్టాన్ని హృదయాన్ని కదిలించే విధంగా ప్రతిబింబించిన కవిత.

స్వామి నాయుడు గారి కవిత్వంలో "శతర" మూడవ కవితా సంపుటి ఒక ముఖ్యమైన మైలురాయి. ఇందులోని కవితలు ఆదివాసీ జీవనాన్ని వివిధ కోణాల్లో ప్రతిబింబిస్తాయి. అడవి వారికి కేవలం నివాసం కాదు, అది వారి అస్తిత్వం, జీవనాధారం అనే భావన ఆయన కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. కానీ ఆధునిక అభివృద్ధి పేరుతో జరిగే మైనింగ్ కార్యకలాపాలు, కార్పొరేట్ దోపిడీ, ప్రభుత్వ విధానాలు ఆదివాసీల జీవనాన్ని ఎలా సంక్షోభంలోకి నెట్టాయో ఆయన తీవ్రంగా విమర్శిస్తారు. టూరిజం పెరగడం వల్ల సంస్కృతి క్షీణించడం, ఆరోగ్య సమస్యలు పెరగడం వంటి అంశాలను కూడా ఆయన తన కవిత్వంలో ప్రతిబింబించారు. "అడవి ఇప్పుడు ఒక పచ్చి గాయం" అనే భావన ద్వారా ప్రకృతిపై జరిగిన దాడిని ఆయన హృదయానికి హత్తుకునేలా వ్యక్తం చేశారు.

స్వామి నాయుడు కవిత్వంలో ఆదివాసీలు కేవలం ఒక అంశం కాదు. వారు కవిత్వానికి వారి జీవితాలు సమాజానికి కేంద్రబిందువుగా నిలుస్తారు. వారి సంస్కృతి, భాష, సంప్రదాయాలు, బాధలు అన్నీ వీరి కవిత్వంలో సహజంగా ప్రవహిస్తాయి. ఇతర సాహిత్యంలో కనిపించే సానుభూతికి భిన్నంగా, వీరి కవిత్వంలో స్వయానుభూతి కనిపిస్తుంది. అందువల్ల వీరి కవిత్వం నిజాయితీతో కూడినది, ప్రామాణికమైనది. వీరి కవితల్లోని భాష కూడా చాలా సూటిగా, పదునుగా ఉంటుంది. సమాజంలోని అసమానతలు, దౌర్జన్యాలు, అన్యాయాలను ఆయన ఎటువంటి అలంకారాలు లేకుండా నేరుగా వ్యక్తం చేస్తారు. "గెలుపెవరిదైతేనేమి, ఓడిపోయింది మానవతే" వంటి పాదాలు ఆయన దృష్టిలోని మానవతా కోణాన్ని ప్రతిబింబిస్తాయి.

ప్రకృతి స్వామి నాయుడు కవిత్వంలో ఒక జీవంతమైన పాత్రగా కనిపిస్తుంది. అడవి, గాలి, నేల వంటి అంశాలు కేవలం నేపథ్యం కాదు. అవి జీవనానికి సంకేతాలు. అడవి నశించడం అంటే ఒక జాతి అస్తిత్వం నశించడం అనే భావన వీరి కవిత్వంలో ప్రతిధ్వనిస్తుంది. అందువల్ల వీరి కవిత్వం పర్యావరణ చైతన్యానికి కూడా ఒక ముఖ్యమైన సాధనంగా నిలుస్తుంది. ఆయన రచనల్లో విప్లవాత్మక దృక్పథం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తి శక్తిని, సమూహ చైతన్యాన్ని వీరు విశ్వసిస్తారు. ఒక వ్యక్తి కూడా సమాజంలో మార్పుకు నాంది పలకగలడనే భావనను వీరు పదేపదే వ్యక్తం చేస్తారు.

వర్గపోరాటం, సామాజిక అసమానతలు కూడా ఆయన కవిత్వంలో ముఖ్యమైన అంశాలు. "ఒక శవపేటికలో" వంటి కవితల్లో జీవితం మొత్తం పోరాడిన వర్గాలు మరణానంతరం సమానమవుతాయని చెప్పడం ద్వారా సమాజంలో సమానత్వం అవసరాన్ని గుర్తుచేస్తారు. ఆయన కవిత్వం కేవలం విమర్శతోనే ఆగిపోదు; అది ఒక మార్పు కోసం పిలుపునిస్తుంది. సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి ఆయన అక్షరాల్లో ఉంది. మొత్తానికి సిరికి స్వామి నాయుడు కవిత్వం ఆదివాసీ అస్తిత్వ పోరాటానికి అద్దం పట్టే శక్తివంతమైన సాధనం. అది ప్రకృతి విధ్వంసంపై హెచ్చరిక, సామాజిక అన్యాయాలపై ప్రతిఘటన, మానవత్వానికి పిలుపు. వీరి అక్షరాలు కేవలం కవితలు కాదు. అవి చైతన్యం నింపే శక్తులు. వీరి కవిత్వం చదవడం అంటే ఒక కొత్త దృష్టికోణాన్ని పొందడం, సమాజాన్ని లోతుగా అర్థం చేసుకోవడం. అందుకే వీరి రచనలు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించాయి.

– శైలజామిత్ర
9290900879



# జ్ఞానం ఎప్పుడూ తటస్థం కాదు

## అది సమాజాన్ని ఉన్నతంగా నిలబెట్టగల శక్తి కూడా..!

(చెన్నై అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ జర్నైల్ సింగ్ ఆనంద్)





26 మార్చి 2026న చెన్నై అంబత్తూరు లోని జపనీస్ కవి పేరుతో పాతికేళ్లుగా డాక్టర్ సేతు కుమనన్ వ్యవస్థాపకులుగా నడుపుతున్న సోక ఇకేదా మహిళా కళాశాల, చండీఘర్ కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ ఎథిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మారుతున్న కొత్త ఆవిష్కరణల ప్రపంచంలో యువత మేధస్సు కొత్త దిశానిర్దేశం అంశంతో అంతర్జాతీయ సదస్సు, కవితా సమ్మేళనం జరిగింది. అతిథుల జ్యోతి ప్రజ్వలనం, తమిళ రాష్ట్ర గీతం తో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. సెర్బియా నుండి అంతర్జాతీయ అకాడెమీ ఆఫ్ ఎథిక్స్ సంస్థ ఉపాధ్యక్షులు డా మాయ హెర్మన్ షెక్యులిక్ వర్చువల్‌గా కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా సేతు కుమనన్ తమ కళాశాల సిబ్బంది , విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, యువ విద్యార్థినిలను నేపథ్య అంశం ప్రభావితం చేయగలదని ఆశించారు. ఈ సందర్భంగా డాక్టర్ సేతు కుమనన్‌కు సదస్సు కార్యనిర్వాహకులు డాక్టర్ జర్నైల్ సింగ్ ఆనంద్, డాక్టర్ పెరుగు రామకృష్ణ అకాడెమీ ఫెలోషిప్ బహుకరించారు. కార్యక్రమ రూపకర్తలు, బహు గ్రంథ రచయితలు డాక్టర్ జర్నైల్ సింగ్ ఆనంద్, డాక్టర్ పెరుగు రామకృష్ణ లను సోక ఇకేదా స్మారక మెగా సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. డాక్టర్ జర్నైల్ సింగ్ ఆనంద్ తమ సంస్థ ఐ ఏ ఈ తరపున అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణను రోల్ ఆఫ్ హానర్‌తో కవయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయిని పెరుగు సుజనారామంను అంబాసిడర్ ఆఫ్ ఎటర్నిటీ అవార్డుతో, ప్రశంసా పత్రం తో సత్కరించారు. పలు రచయితల కొన్ని పుస్తకాలు ఆవిష్కరణ చేశారు.

సెమినల్ కీలక ప్రసంగం చేసిన డాక్టర్ ఆనంద్ AI యుగంలో ప్రతిజ్ఞ ఎలా ప్రతిధ్వనిస్తుంది.

జ్ఞానం ఎప్పుడూ తటస్థం కాదు, అది సమాజాన్ని ఉన్నతంగా నిలబెట్టగల శక్తి కూడా, లేదా దాని నైతిక పునాదిని దెబ్బతీయగల శక్తి కూడా. ఈ సత్యాన్ని డా ఆనంద్ చెన్నైలోని సొకా ఇకెడా కాలేజ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో స్పష్టంగా చెప్పారు. ఆ సదస్సు అంశం --- "Reformatting Young Minds for a Grand New World".

ఆయన చెప్పిన ముఖ్యమైన ఆలోచన – Ethical Alphabet:

K అంటే Kindness (దయ),
F అంటే Forgiveness (క్షమ),
E అంటే Ethics (నైతికత),
C అంటే Compassion (కరుణ).

ఇవి కేవలం మాటలు కాదు, ఈ కాలంలో మనసుకు మార్గదర్శకాలు. జ్ఞానం వేగంగా పెరుగుతున్న ఈ ప్రపంచంలో, దానికి తోడు నైతికత కూడా ఉండాలి అని ఆయన సూచించారు.

డా. ఆనంద్ గారు మాటలతో మాత్రమే ఆగలేదు. ఆయన విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఒక ప్రతిజ్ఞ (శఫ్థ) చేయించారు:

"నా జ్ఞానాన్ని సమాజ మేలుకోసం ఉపయోగిస్తాను.
నా జ్ఞానం లేదా శక్తిని సమాజ నైతిక విలువలకు హాని కలిగించేలా ఉపయోగించను అని మాట ఇస్తున్నాను."

ఈ ప్రతిజ్ఞ చాలా లోతైనది. డిగ్రీ సర్టిఫికెట్‌పైనే ఈ ప్రతిజ్ఞను చేర్చాలని ఆయన సూచించారు. అంటే, విద్యార్థి డిగ్రీతో పాటు బాధ్యతను కూడా తీసుకెళ్తాడు.

విద్య అనేది "ఏం చేయాలి" మాత్రమే కాదు, "ఏం చేయకూడదు" కూడా నేర్పాలి అని ఆయన స్పష్టం చేశారు.

ఈరోజు AI, బయోటెక్నాలజీ వంటి శక్తివంతమైన సాధనాలున్న ప్రపంచంలో, ఈ సందేశం చాలా అవసరం. నైతికత లేని జ్ఞానం ప్రమాదకరం ,అది ప్రకృతి నాశనం, డిజిటల్ మోసాలు, తప్పుదారి పట్టించే నాయకత్వం వంటి సమస్యలకు కారణమవుతుంది.

ఈ ప్రతిజ్ఞ ద్వారా ఒక ముఖ్యమైన సందేశం వెలుగులోకి వస్తుంది: డిగ్రీ అనేది మీరు ఎంత తెలుసుకున్నారో కాదు ,మీరు ఎలా జీవిస్తారో చెప్పే వాగ్దానం.

ఆ సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఈ ప్రతిజ్ఞ చేయడం ఒక చిన్న వేడుక కాదు అది ఒక నిశ్శబ్ద విప్లవం.

ఇలాంటి ఆచరణలు అన్ని విద్యాసంస్థల్లో ప్రారంభమైతే, మనం కేవలం నిపుణులను కాదు, బాధ్యతగల మనుషులను తయారు చేస్తాము. దయ, క్షమ, నైతికత, కరుణ ,ఇవి బలహీనతలు కావు. ఇవి జ్ఞానాన్ని సురక్షితంగా, సద్వినియోగంగా ఉంచే శక్తులు.

ఈ ప్రతిజ్ఞ ఒక కొత్త ప్రపంచానికి మొదటి అడుగు విలువైన ప్రసంగంలో చెప్పారు.

అనంతరం అంతర్జాతీయ కవి, సార్క్ సాహిత్య పురస్కార గ్రహీత జపనీస్ ఆరాధ్య కవి డాక్టర్ దైసాకు ఐకేడా రచనల్లో నైతికత అంశంపై ప్రసంగించారు. దేశం నలు మూలల నుంచి 30 మంది లబ్ధ ప్రతిష్ఠ కవులు, రచయితలు, విద్యావేత్తలు రెండు సదస్సులో పత్రసమర్పణలు చేసి కవితా పఠనం చేసి ప్రసంగించారు .

ముగింపు సదస్సులో చెన్నై హైకోర్టు న్యాయవాది, ద్విభాషా కవి వానవిల్ రవి హాజరై మహాకవి భారతి, షెల్లీ రచనల తులనాత్మక విషయాలు వివరించారు. అనంతరం డాక్టర్ ఆనంద్ వానవిల్ రవికి అకాడమీ ఫెలోషిప్‌తో గౌరవించారు.మహాకవి భారతి సంస్థ నిర్వాహకులు కూడా అయిన వనవిల్ రవి డాక్టర్ ఆనంద్, డాక్టర్ సేతు కుమనన్, డాక్టర్ మాయ, డాక్టర్ పెరుగు రామకృష్ణ లకు మహాకవి భారతి అవార్డులు అందజేశారు .

ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా విచ్చేసిన ప్రముఖ కవులు, రచయితలుకు నిర్వాహకులు అంబస్సాడోర్ ఆఫ్ ఎటర్నిటీ అవార్డు జ్ఞాపిక, ప్రశంసా పత్రం లతో అభినందించారు.. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మీరా, వైస్ ప్రిన్సిపాల్ కన్మణి, వ్యాఖ్యాత డాక్టర్ సంధ్యాలక్ష్మి ఎంతో క్రమశిక్షణతో కార్యక్రమం నిర్వహించి అతిథులను ఆత్మీయంగా ఆదరించారు..!

## నువ్వే...!

ఒక నిమిషం ఆగి...
ఆ వైపు చూడు!
జాబిల్లి నక్షత్రాలను కవ్విస్తూ...
రాత్రిని మధురం చేస్తున్నాడు!

మరో నిమిషం ఆగి...
మరో మారు చూడు!
ప్రచండ మార్తాండుడై గర్జిస్తూ...
పగలును సూర్యుడు శాసిస్తున్నాడు!

అటువైపు ఆకాశాన్ని చూడు!
అన్నీ గమనిస్తూ...
ఏమీ ఆశించక...
మౌన ముద్రలో ధ్యానిస్తోంది!

ఎందుకలా అలజడిలో...
నేలను వీడలేక...
నింగిని తాకలేక...
ఏదో కోల్పోయిన అలలా అలా!

ఒక నిశి రాత్రి చీకటిని కాసింత తాగి...
ఒక మధ్యాహ్నం వెలుగులో స్నానించి...
నీలోకి నువ్వు...
ఒక్కసారి చూసుకో!

తలకట్టు అక్షరానికి ఏవైపు పెట్టాలో...
అర్థం కాని పసిమొగ్గలా కనిపిస్తావు!
పువ్వులా మారడమా...మొగ్గలా మారకమా...
ఏమైనా కారణం మాత్రం నువ్వే!

గుడ్లదొన సాయి చంద్రశేఖర్
హైదరాబాద్

